పేదోడి కల సాకారమయ్యేదెన్నడో?

- నూతన గృహాల మంజూరులో 'కూటమి' నిర్లక్ష్యం
- ఏడాదిగా ఎదురుచూస్తున్న నిరుపేదలు
- దరఖాస్తు చేసుకున్నా స్పందించని అధికారులు



75 వీరాపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ హయాంలో మంజూరైన ఇళ్లు

గుమ్మఘట్ట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదలందరికీ పక్కా ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ప్రతి గడపకూ వెళ్లి వలంటీర్ల ద్వారా దరఖాస్తులు స్వీకరించి, అర్హత ఉంటే చాలు.. ఇళ్లు నిర్మించి ఇచ్చారు. సార్వత్రిక ఎన్నికల తర్వాత కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది. ఏడాది కాలంగా ఒక్క ఇల్లు ఇచ్చిన పాపానపోలేదని, దరఖాస్తు చేసుకున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదని పేదలు ఆవేదన చెందుతున్నారు.

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రాయదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా 3,289 మంది నూతన గృహాల కోసం పేదలు దరఖాస్తు చేసుకున్నట్లు అధికారిక లెక్కలు చెప్తున్నాయి. వైఎస్సార్‌సీపీ హయాంలో రాయదుర్గం నియోజకవర్గంలో 5,574 ఇళ్లను మంజూరు చేయగా, 3,454 ఇళ్లు పూర్తయ్యాయి. బిల్లులు కూడా మంజూరయ్యాయి. మిగిలిన గృహా ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. జగనన్న లేఅవుట్లలో రోడ్లు నిర్మించారు. విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించారు.

మా హయాంలో పేదలందరికీ ఇళ్లు



వైఎస్సార్‌సీపీ హయాంలో అర్హులందరికీ పార్టీలకతీతంగా నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నూతన గృహాలను మంజూరు చేసి, నిర్మించి ఇచ్చాం. పేదలను ఇబ్బంది పెట్టకుండా బిల్లులు కూడా మంజూరయ్యాయి. రాజకీయాలు చూడకుండా, ఓటు వేశారన్నది చూడకుండా అన్ని వర్గాలకూ గృహాలు మంజూరు చేసి, వారి కళ్లలో ఆనందం చూడాలన్నదే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయం. జగనన్న కాలనీల్లో రోడ్లు, విద్యుత్, తాగునీటి వసతులను ఎప్పటికప్పుడు కల్పించారు. అర్హులైన నిరుపేదలకు కూటమి ప్రభుత్వం నూతన గృహాలు మంజూరు చేసి, నిర్మించి ఇవ్వాలి.

– మెట్టు గోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, రాయదుర్గం

నూతన గృహాలు ఎప్పడిస్తారో?



ప్రభుత్వం కొత్త గృహాలు ఎప్పుడు మంజూరు చేస్తారోనని ఎదురుచూస్తున్నాం. ప్రభుత్వం సొంతిల్లు నిర్మిస్తుందని ఆశతో ఉన్నాం. ఇంటి కోసం గ్రామ సచివాలయంలో దరఖాస్తు కూడా చేసుకున్నాం. అధికారులను అడిగితే వస్తుందని చెప్తున్నారుగానీ ఇల్లు మంజూరు కాలేదు. – అంజినమ్మ, బేలోడు గ్రామం

అర్హులందరికీ ఇళ్లు ఇవ్వాలి



అర్హులందరికీ ప్రభుత్వం నూతన గృహాలు మంజూరు చేయాలి. కొత్త ఇళ్ల నిర్మాణం కోసం అనేక మంది లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. ఆర్థిక స్థోమతను బట్టి లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకుంటారు. నూతన గృహాల కోసం ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరుగుతున్నాం. – సువార్తమ్మ, తాళ్లకెర గ్రామం

ప్రభుత్వ అనుమతులు రావాలి..



పేదలు నూతన గృహాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే నూతన గృహాల మంజూరుకు ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉంది. వచ్చిన వెంటనే అర్హులైన వారిని గుర్తించి నూతన గృహాలు మంజూరు చేస్తాం. త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. – వెంకటేశ్వర్లు, హౌసింగ్ డీఈ

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఉద్యమాలు



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప

ఉరవకొండ: విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప తెలిపారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు కృష్ణమూర్తితో కలిసి విలేకరులతో మాట్లాడారు. మోదీ చేతిలో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు కీలు బొమ్మలుగా మారి అదానీతో చీకటి ఒప్పందం చేసుకొని స్మార్ట్‌మీటర్లను బిగించేలా ఒప్పందం చేసుకున్నారని విమర్శించారు. విద్యుత్ భారాన్ని తగ్గిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన చంద్రబాబు.. ఏడాది పాలనలోనే రూ.15,485 కోట్ల సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపారన్నారు. ఇప్పటికే స్మార్ట్ మీటర్లు బిగించిన షాపులు, చిన్న పరిశ్రమలకు 10 రెట్లు కరెంట్ చార్జీలు పెరిగి లబోదిబో మంటున్నారని తెలిపారు. దీంతో పాటు మీటర్లపై అయ్యే ఖర్చు రూ.10 వేల నుంచి రూ.17 వరకు వినియోగదారులపై మోపేందుకు సిద్ధమయ్యారని అన్నారు. అందుకే అదానీ స్మార్ట్‌మీటర్లు, సోలార్ విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలకు శ్రీకారం చుడుతున్నామన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మధుసూదన్, ప్రాంతీయ కార్యదర్శి రంగారెడ్డి, కమిటీ సభ్యుడు శీనప్ప, మురళీ, వీరాంజనేయులు, సిద్దప్ప పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎటుచూసినా అపరిశుభ్రతే



మలయనూరు ఎస్సీ కాలనీలోని రోడ్డు దుస్థితి

కుందుర్పి: మండలంలోని మలయనూరు ఎస్సీ కాలనీలో అపరిశుభ్రత తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. కాలనీకి కనీసం సీసీ రోడ్లు కూడా నిర్మించలేదని, కంపచెట్లు పెరిగి, ఎక్కడ చూసినా అపరిశుభ్రత నెలకొందని, దీనిపై ఎంపీడీఓ లక్ష్మీశంకర్‌కు కూడా విన్నవించినట్లు కాలనీవాసులు చెప్తున్నారు. పలుమార్లు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపినా ఫలితంలేదని, ఇటీవల మలయనూరులో పర్యటించిన ఎమ్మెల్యే సురేంద్రబాబుకు కూడా సమస్య విన్నవించామన్నారు. ప్రస్తుత వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని అపరిశుభ్రత తొలగించాలని, సీసీ రోడ్లు వేయించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఆముదం సాగుపై రైతుల ఆసక్తి



ముద్దలాపురం వద్ద సాగు చేసిన ఆముదం పంట

కూడేరు: వర్షాభావంతో వేరుశనగ సాగుకు అదను దాటిపోయింది. దీంతో చాలా మంది రైతులు ఆముదం సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ముద్దలాపురం, బ్రాహ్మణపల్లి, కమ్మూరు, గొటుకూరు, రామచంద్రాపురం, జల్లిపల్లి, కరుట్లపల్లి, కడదరకుంట, చోళసముద్రం, పి.నారాయణపురం, తిమ్మాపురం, జయపురంతో పాటు మరికొన్ని గ్రామాల్లో ఇప్పటికే సుమారు 600 ఎకరాల్లో ఆముదం పంట సాగు చేశారు. మండల వ్యాప్తంగా సుమారు 5 వేల ఎకరాలకు పైగానే ఆముదం సాగయ్యే అవకాశం ఉంది. మండలంలో వేరుశనగ సాధారణ విస్తీర్ణం సుమారు 25 వేల ఎకరాలు. వేరుశనగ విత్తు అదును జూన్ 15న ప్రారంభమై, ఈ నెల 15తో ముగిసింది. అయితే విత్తనానికి పదునైన వర్షాలు కురవలేదు. తక్కువ పెట్టుబడితో సాగయ్యే ఆముదం పంట సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు.

పంటలకు అడవి పందుల బెడద



జంబుగుంపల సమీపంలో మొక్కజొన్న మొలకలను తోడేసిన దృశ్యం

కుందుర్పి: మండలంలోని జంబుగుంపల, బెస్తరపల్లి అటవీ ప్రాంతంలో పంటలకు అడవి పందుల బెడద అధికమైంది. సుమారు 30 ఎకరాల మేర వేరుశనగ, మొక్కజొన్న, రాగి పంటలను అడవి పందులు ధ్వంసం చేసినట్లు బాధిత రైతులు తిప్పేస్వామి, మారెక్క, బాబు, జయరామప్ప అటవీ సెక్షన్ అధికారి పరమేశ్వరప్పకు ఆదివారం ఫిర్యాదు చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బెళుగుప్ప: మండల పరిధిలోని గంగవరం గ్రామానికి చెందిన చాకలి చంద్రశేఖర్ (44) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. ఈనెల 17న గంగవరంలో చంద్రశేఖర్ తన ఇంటి పైకప్పుపైకి ఎక్కుతూ నిచ్చెనపై నుంచి జారి పడ్డాడు.తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఒక కొడుకు, కూతురు ఉన్నారు. మృతుడి భార్య సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ శివ తెలిపారు.

యువ రైతు మృతి



రైతు అంజనేయులు (ఫైల్)

రాయదుర్గంటౌన్: మండలంలోని కెంచానపల్లికి చెందిన యువ రైతు ఆంజనేయులు (38) అనంతపురంలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఆంజనేయులు ఈనెల 16న పొలం పనులకు వెళ్లి పక్కనే ఉన్న చెరువు గట్టుపై నుంచి జారి పడి గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు అతన్ని చికిత్స నిమిత్తం అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. చేదోడుగా ఉంటున్న కుమారుడు మృతితో తల్లి చిన్న మారెక్క బోరున విలపించింది. కేసు నమోదు చేసినట్లు రాయదుర్గంలో పోలీసులు తెలిపారు.

నేడు కెనరా బ్యాంకు సిల్వర్ జూబ్లీ వేడుకలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కెనరా బ్యాంకు (సిండికేట్) ఏర్పాటై 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు ఈనెల 21న నిర్వహిస్తున్నట్లు బ్రాంచ్ మేనేజర్ గురుప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. బ్యాంకు కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ఖాతాదారులతో వార్షికోత్సవ సభ ఉంటుందన్నారు. ముఖ్య అతిథిగా జిల్లా రీజినల్ మేనేజర్ శ్రీనివాసులు హాజరవుతున్నట్లు తెలిపారు.

సూపర్‌సిక్స్‌తో చంద్రబాబు వంచన



సమావేశంలో మాట్లాడుతున్న రాయదుర్గం సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి



సమావేశానికి హాజరైన కార్యకర్తలు, నాయకులు

- రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టోలో సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి

కణేకల్లు: 'సూపర్ సిక్స్'తో అన్ని వర్గాల ప్రజలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వంచించారని వైఎస్సార్‌సీపీ రాయదుర్గం సమన్వకర్త మెట్టు గోవిందరెడ్డి మండిపడ్డారు. అధికారంలో రాగానే హామీలన్నీ అమలు చేస్తామని చెప్పి.. అధికారంలోకొచ్చి 13 నెలలైనా అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ఆదివారం కణేకల్లులోని చిక్కణ్ణేశ్వరస్వామి కళ్యాణమంటపంలో 'రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మెట్టు సభనుద్దేశించి మాట్లాడారు. అధికారం కోసం అబద్దాలు చెప్పడంలో చంద్రబాబు ఆరితేరారన్నారు. 2014లో రైతు రుణాలన్నీ మాఫీ, డ్వాక్రా రుణాలన్నీ మాఫీ అంటూ ప్రజలను నమ్మించి అధికారంలో వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. 2024లో 'సూపర్ సిక్స్' పథకాలు చెప్పి ప్రజలను ఊరించి నమ్మించి అధికారంలో వచ్చి వాటిని అమలు చేయకుండా మరోమారు మోసం చేస్తున్నారన్నారు. మూడోసారి ఎవరూ ఈ మోసగాన్ని నమ్మరన్నారు. 'ఆడబిడ్డ నిధి' కింద 18 ఏళ్ల దాటిన మహిళలకు ప్రతి నెలా రూ.1500, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, రైతులకు అన్నదాత సుఖీభవ, మహిళకు ఫ్రీ బస్సు, 50 ఏళ్లకే పింఛన్, వసతిదీవెన, విద్యాదీవెన ఇవన్నీ ఎక్కడ అమలు చేశారో చెప్పాలన్నారు. ఏం చేశారని 'సుపరిపాలనలో తొలి అడుగు' పేరుతో జనాల్లో వెళ్తున్నారని కూటమి నేతలను ఆయన ప్రశ్నించారు. ఏడాది పాలనంత ప్రజలకు మోసం చేయడానికి కూటమి ప్రభుత్వానికి సరిపోయిందన్నారు. తల్లికి వందనం పథకానికి అనేక ఆంక్షలు పెట్టి అనేక మంది తల్లులకు వేదన మిగిల్చిన పాపం ఈ కూటమి ప్రభుత్వానిదన్నారు.

సంపద సృష్టి అంటే కరెంటు చార్జీలు పెంచడమా?

సంపద సృష్టి 'సూపర్ సిక్స్' పథకాలను అమలు చేస్తానన్న చంద్రబాబు సంపద సృష్టించేదేమీ లేదన్నారు. కరెంటు చార్జీలు పెంచి ప్రజలపై రూ.9వేల కోట్ల అదనపు భారాన్ని మోపిందని మెట్టు విమర్శించారు. సంపద సృష్టి అంటే ఇదేనా? అని ప్రశ్నించారు. అధికారంలో వస్తే విద్యుత్ చార్జీలను పెంచేదిలేదు తమ్ముళ్లా అంటూ చెప్పిన చంద్రబాబు.. అధికారంలో రాగానే మాట తిప్పేశారన్నారు.

ఇంటింటా బాబు మోసాలను గుర్తు చేయండి

అధికారంలో రాక ముందు చంద్రబాబు ఏం చెప్పాడు... అధికారంలో వచ్చాక ఏం ఇస్తున్నాడో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని మెట్టు గోవిందరెడ్డి కార్యకర్తలకు సూచించారు. తల్లికి వందనం అయినా సరిగా వచ్చిందా? అంటూ అడిగి తెలుసుకోవాలన్నారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి బాబు చెప్పిన హామీలను ఒక సారి గుర్తు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వంపై పోరాటం చేసి ఇచ్చిన హామీలను నెరవేర్చేలా చేయడం ప్రతిపక్షపార్టీగా తమ బాధ్యత అన్నారు. నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పని చేసి పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. ఎవరికే కష్టం వచ్చిన తాను అండగా ఉంటానన్నారు. అధికారపార్టీ నేతల బెదిరింపులకు భయపడొద్దన్నారు. ఎన్నికలెప్పుడొచ్చిన మళ్లీ అధికారంలో వచ్చేది జగనేనన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో వచ్చిన తర్వాత కార్యకర్తలకు పెద్దపీట వేస్తోందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సభ్యురాలు డి.పద్మావతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఉషారాణి, జిల్లా ఉపాధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, జిల్లా కార్యదర్శి పాటిల్ చెన్నకేశవరెడ్డి, కోశాధికారి పాటిల్ నాగిరెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్పచౌదరి, వివిధ అనుబంధ విభాగాల నేతలు హళ్లి నాగరాజు, ఆలూరు చిక్కణ్ణ, ఆదిసద్గురు చంద్రశేఖర్‌రెడ్డి, వేమన, ఆర్‌కే బద్రీ, ఎం.కృష్ణారెడ్డి, డి.శ్రీనివాసులు, పుల్లంపల్లి పెద్దిరెడ్డి, కెంగుట రామిరెడ్డి, యంత్రకాయల వన్నూరప్ప, మల్రేగౌడ్, గలిబే అనిల్‌కుమార్‌తోపాటు సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబు ప్రజలకిచ్చిన బాండ్‌ను చూపిస్తున్న మెట్టు గోవిందరెడ్డి

వీధికో బెల్టుషాపు కూటమి సర్కారు ఘనత

చంద్రబాబు సర్కారు రాష్ట్రాన్ని మద్యాంధ్ర ప్రదేశ్‌గా మార్చేసిందని మెట్టు దుయ్యబట్టారు. జగన్ అధికారంలో ఉన్నప్పుడు పేద ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలనే ఉద్దేశంతో మద్యం షాపులను గణనీయంగా తగ్గిస్తే... చంద్రబాబు సర్కారు మాత్రం ఊరూవాడా బెల్టుషాపులు పెట్టి పేద ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారన్నారు. అవసరమైతే డోర్ డెలవరీ కూడా కూటమి సర్కారు సిద్ధంగా ఉందన్నారు.

దుర్గంలో ట్రాఫిక్ సమస్య జఠిలం



వినాయక సర్కిల్‌లో ప్రైవేట్, ఆర్టీసీ బస్సుల టర్నింగ్‌లతో ఇబ్బందులు పడుతున్న పాదచారులు, వాహనదారులు



గాంధీ సర్కిల్‌లో రోడ్డుపైనే బస్సు నిలిపి ప్రయాణికులను దింపుతున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని రోజురోజుకూ ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారుతోంది. ట్రాఫిక్‌ను నియంత్రించి ప్రజా రవాణాను, రాకపోకలను సాఫీగా జరిగేలా చేయాల్సిన పోలీసులు పట్టించుకోలేదు. దీంతో బస్సులు, ఆటోవాలాలు, తోపుడు బండ్ల వ్యాపారాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.

ప్రధానంగా వినాయక సర్కిల్, బళ్లారి రోడ్డు, గాంధీ సర్కిల్, పాత బస్టాండ్ అనంతపురం మెయిన్ రోడ్డు వద్ద సమస్య అధికంగా ఉంది. వినాయక సర్కిల్‌లో సమస్య నేటికీ కొనసాగుతోంది. మొలకాల్మూరు, బళ్లారి వైపుకు వెళ్లే ప్రైవేట్ బస్సులతో పాటు ఆర్టీసీ బస్సులు సైతం వినాయక సర్కిల్‌లోనే టర్న్ చేస్తుండడంతో ప్రజల ప్రాణాలమీదుకొస్తోంది. అక్కడ బస్సులను నిలిపి ప్రయాణికులను దించుతున్నారు.

పలుమార్లు ప్రమాదాలు జరిగిన సందర్భాలూ ఉన్నాయి. సమస్య తీవ్రంగా ఉందని తెలిసి కూడా పోలీసులు చర్యలు తీసుకోలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. గాంధీ సర్కిల్‌లో ఒక వైపు తోపుడు బండ్లు రోడ్లపై పెట్టి వ్యాపారాలు చేస్తుండగా ప్రైవేటు బస్సులు అక్కడ నిలిపి ప్రయానిలను దింపుతున్నారు. మరోవైపు బస్సులు వచ్చిన సమయంలో ప్రయాణికుల కోసం ఆటో డ్రైవర్లు చుట్టూ పార్కింగ్ చేసి, ట్రాఫిక్ సమస్యను పెంచుతున్నారు. పాత బస్టాండ్ అనంతపురం రహదారిపై కూడా బస్సులు, ప్యాసింజర్ ఆటోలు నిలబెట్టి కనీసం పాదాచారులు వెళ్లే అవకాశం లేకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

మోకాళ్లపై కూర్చొని కార్మికుల నిరసన



రాయదుర్గంలోని వినాయక సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

రాయదుర్గంటౌన్: డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారంతో ఎనిమిదోరోజుకు చేరుకుంది. పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన శిబిరంలో కార్మికులంతా కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకొని మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ మాట్లాడారు. కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. జీవో నంబర్ 36 ప్రకారం కనీస వేతనం అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, హెల్త్, రిస్క్ అలవెన్స్‌లు అమలు చేయాలని, ఆప్కాస్ కార్మికులందరిని రెగ్యులర్ చేయాలని, చనిపోయిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వైభవంగా పాండురంగస్వామి దిండి ఉత్సవం



ఉరవకొండలో ర్యాలీ చేస్తున్న భావసార క్షత్రియ సమాజ్ కులస్తులు

ఉరవకొండ: పట్టణానికి చెందిన భావసార క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో పాండు రంగస్వామి దిండి ఉత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక విఠల్ రుక్మిణీఆలయం నుంచి మేళ తాళాలతో పాండురంగస్వామి చిత్రపటంతో పట్టణవీధుల్లో భావసార క్షత్రియ కులస్తులు ర్యాలీ చేశారు. ర్యాలీ తిరిగి ఆలయానికి చేరుకొని స్వామికి ప్రత్యేక పూజలు చేసి, భజనలు చేశారు. పాండరంగస్వామి, రుక్మిణీ అమ్మవారి ఉత్సవమూర్తులను ఉయ్యాల ఉత్సవం నిర్వహించి, భజనలు చేశారు. అనంతరం విఠల్ రుక్మిణి అనాథాశ్రమంలో ఆశ్రమ వ్యవస్థాపకుడు ఎర్రిస్వామి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో భావసార క్షత్రియ సమాజ్ అధ్యక్షుడు ఈశ్వర్‌రావు, కౌషిక్‌రావు, కిషోర్, రాము, సుధాకర్, అనిల్, ఉదయ్, రమేష్, శ్రీకాంత్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చిన్న పీర్ల పండుగ



చెలిమేపల్లిలో పీర్లస్వాములను ఊరేగిస్తున్న దృశ్యం



పాబ్బర్లపల్లిలో జలధికి బయల్దేరిన పీర్లు



కూడేరులో ఊరేగింపుగా తరలివెళ్తున్న పీర్లస్వాములు

బ్రహ్మసముద్రం : మండలంలోని చెలిమేపల్లి, పాబ్బర్లపల్లి గ్రామాల్లో పీర్ల పండుగ ఆదివారం నిర్వహించారు. పీర్ల చావిడిలో పీర్లస్వాములుకు చెక్కెర, బెల్లం, కొబ్బెర చదివించారు. ఆదివారం సాయంత్రం ఆఖరి రోజు అగ్ని గుండ ప్రవేశం చేశారు. అనంతరం పీర్లను గ్రామంలో ఊరేగించి, జలధికి తరలించారు.

కూడేరు: అరవకూరులో కులమతాలకతీతంగా హిందూ ముస్లింలు పీర్ల పండుగ ఘనంగా జరిగింది. మొహర్రం వేడుకల్లో భాగంగా ఆదివారం పీర్ల జలధి కార్యక్రమం జరిగింది. వేకువజామున పీర్ల దేవుళ్ల అగ్ని గుండ ప్రవేశం చేశారు. సాయంత్రం పీర్ల దేవుళ్లకు ముజువార్ ప్రత్యేక చదివింపులు జరిపి గ్రామ పురవీధుల్లో మంగళవాయిద్యాల నడుమ జలధికి తీసుకెళ్లారు. కూడేరులో చిన్న పీర్ల పండగ ఘనంగా జరిగింది. ఆదివారం పీర్ల జలధి కార్యక్రమాన్ని గ్రామ ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. సాయంత్రం మంగళ వాయిద్యాల నడుమ పీర్లను జలధికి తీసుకెళ్లారు.

బెళుగుప్ప: మండల పరిధిలోని ఎర్రగుడి గ్రామంలో చిన్న మొహర్రం వేడుకలను ఆదివారం నిర్వహించారు. స్థానిక పీర్లచావిడిలోని పీర్ల స్వాములుకు చెక్కెర చదివింపుల అనంతరం అగ్నిగుండ ప్రవేశం చేశాయి. సాయంత్రం జలధికి తీసుకెళ్లారు. రామసాగరంలోనూ మొహర్రం వేడుకల్లో భాగంగా సాయంత్రం పీర్లస్వాములు జలధికి తరలివెళ్లాయి.

కుందుర్పి: మండలంలోని జంబుగుంపల గ్రామంలో ఆదివారం మొహర్రం వేడుకలు ఘనంగా ముగిశాయి. ఏటా జంబుగుంపల గ్రామంలో చివరగా మొహర్రం వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. శనివారం పెద్దసరిగెత్తు, ఆదివారం జలధి వేడుకలు నిర్వహించారు.

అపూర్వ సత్సంగ విభావరి

అనంతపురం కల్చరల్: నగరంలోని మూడవ రోడ్డు ఘంటసాల భవన్ వేదికగా ఆదివారం సాగిన అపూర్వ సత్సంగ విభావరి శ్రోతలను మంత్రముగ్ధులను చేసింది. మోహన-కల్యాణి స్వర రాగ విభావరిగా ఆ రాగాల్లో స్వరపరచిన పలు భాషల గీతాలను గాయకులు అద్భుతంగా ఆలపించారు. అనంత ఘంటసాల ఆరాధన సమితి నిర్వాహకులు పాల సముద్రం నాగరాజు, విజయలక్ష్మి, ఆచార్య సుధాకరబాబు, డీఆర్వో మలోల పాటలు పాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఔత్సాహిక గాయకులకు విరివిగా అవకాశాలు కల్పిస్తూ వారిని ప్రోత్సహిస్తున్న తీరు అభినందనీయమని నిర్వాహకులను ప్రశంసించారు.

వేలూరు మరియప్పకు మెట్టు పరామర్శ



మరియప్పను పరామర్శిస్తున్న మెట్టు

కణేకల్లు: తన స్నేహితుడు, టీడీపీ నాయకుడైన వేలూరు మరియప్పను రాయదుర్గం సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి ఆదివారం పరామర్శించి, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆరో గ్యం బాగా లేక ఇటీవల మరియప్ప గుండెకు సర్జరీ చేయించుకొని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. వైద్యుల సలహాలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మెట్టు సూచించారు.

28 నుంచి శ్రావణమాస ఉత్సవాలు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 28వ తేదీ నుంచి శ్రావణ మాస ఉత్సవాలు ప్రారంభం అవుతాయని ఆలయ ఈఓ బాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 28వ తేదీన నాగులచవితి సర్పసూక్త క్షీరాభిషేకం, 29న నాగపంచమి సర్పసూక్త పవమాన సూక్త క్షీరాభిషేకం, 30వ తేదీన షష్టి మహోత్సవం, సుబ్రహ్మణ్యేశ్వరుడి కల్యాణోత్సం, ఆగస్టు 9వ తేదీన శ్రావణ పౌర్ణమి విశేష అభిషేకం, 10వ తేదీన అన్నాభిషేకం నిర్వహించడం జరుగుతుందన్నారు.